అద్దె భవనంలో ఆరోగ్య కేంద్రం

- గ్రంథాలయ భవనంలో కొనసాగుతున్న మద్దిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- స్థల పరిశీలన పూర్తయినా ఇప్పటివరకు చేపట్టని భవన నిర్మాణ పనులు
- సౌకర్యాలు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులు



గ్రంథాలయ భవనంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మద్దిరాల : మద్దిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సొంత భవనం లేదు. గతంలో అధికారులు స్థలాన్ని పరిశీలించి జిల్లా అధికారులకు స్థల వివరాలు అందించారు. కానీ ఇంతవరకు భవన నిర్మాణ పనులు చేపట్టలేదు. ప్రస్తుతం మండల కేంద్రంలో గ్రంథాలయం కోసం నిర్మించిన నూతన భవనంలో తాత్కాలికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. అందులో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఆరోగ్య కేంద్రానికి ఒక ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్, ఇన్‌చార్జి ఫార్మసిస్ట్‌ను మాత్రమే కేటాయించారు. ల్యాబ్ సౌకర్యం లేదు, ల్యాబ్ అసిస్టెంట్, స్టాఫ్ నర్సులు లేరు. సూపర్ వైజర్ కూడా లేకుండా ప్రభుత్వం మొక్కుబడిగా ఆస్పత్రిని ఏర్పాటు చేసి చేతులు దులుపుకుందని మండల వాసులు ఆరోపిస్తున్నారు. ఇటీవల చాలా మంది విష జ్వరాల బారిన పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్దామంటే అందులో సరిపడా సిబ్బంది, రోగులకు వసతులు లేక వైద్యం సరిగ్గా అందుతుందో లేదోనని ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సరైన వైద్యం అందడం లేదు



ఇటీవల గ్రామంలో విష జ్వరాలు అధికంగా వస్తున్నాయి. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో సూర్యాపేటలోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నాం. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– పయ్యాల యాదగిరి, రెడ్డిగూడెం

స్థల పరిశీలన పూర్తయింది



మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గతంలోనే ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించాం. నివేదికను జిల్లా అధికారులకు పంపించాం. ప్రస్తుతం టెండర్ల దశలో ఉంది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నూతన భవన నిర్మాణ పనులు చేపడుతాం.

– నగేష్, మద్దిరాల మండల మెడికల్ ఆఫీసర్

యువత మద్యానికి బానిస కావొద్దు


మాట్లాడుతున్న కొత్తూరు సీఐ నర్సింహారావు

పెన్‌పహాడ్: యువత మద్యానికి బానిస కావొద్దని భక్తాళాపురం గ్రామానికి చెందిన కొత్తూరు సీఐ వాడపల్లి నర్సింహారావు అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని భక్తాళాపురం గ్రామంలో చైతన్య వేదిక ఆధ్వర్యంలో మద్యం– యువతపై ప్రభావం అనే అంశంపై చర్చా గోష్టి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం మత్తులో యువత బెట్టింగ్, సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. యువత తప్పుడు పద్ధతులు మానుకొని ఏదో ఒక రంగాన్ని ఎంచుకొని కష్టపడి కుటుంబానికి ఆసరాగా ఉండాలన్నారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి మద్యం వద్దు– చదువే ముద్దు అనే నినాదంతో ప్రతిజ్ఞ చేశారు. భక్తాళాపురం కన్వీనర్ నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ మాజీ ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ రమేష్‌చంద్ర, యర్రంశెట్టి కిరణ్‌కుమార్, చింతం వెంకటేశ్వర్లు, జుట్టుకొండ గణేష్, బుస్సా రామయ్య, నెమ్మాది అడివయ్య, వీరయ్య, రాజేందర్, బాదె వీరేష్, మురళీ, మచ్చ సైదులు, జ్యోతిబస్, సతీష్, ప్రవీణ్, సోమన్న, వీరబాబు, యాకూబ్ పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

తుంగతుర్తి: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని రామాలయం ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్తంభాన్ని ఎక్కి నైవేద్యం తెచ్చేందుకు పలువురు యువకులు పోటీపడ్డారు.


రామాలయం ఎదుట నిర్వహించిన ఉట్లోత్సవానికి హాజరైన గ్రామస్తులు

క్రీడలతో మానసిక ఉల్లాసం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ శ్రీనునాయక్

తుంగతుర్తి : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని సీఐ శ్రీనునాయక్ అన్నారు. మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాలలో పానుగంటి సుమతీదేవి జ్ఞాపకార్థం దాయం రాజిరెడ్డి చారిటబుల్ సౌజన్యంతో నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బోయిని లింగయ్య, ఎస్ఐ ఏడుకొండలు, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దాయం ఝాన్సీరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు చిత్తలూరి వెంకట్రామనర్సమ్మ, పీడీ కొండగడుపుల యాకయ్య, మల్లేష్, రాజయ్య, వెంకన్న, అబ్బయ్య పాల్గొన్నారు.

‘ఓపెన్’ విద్యార్థులకు ఉపకార వేతనాలు

హుజూర్‌నగర్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా దూర విద్యను అభ్యసించే ఎస్సీ ఎస్టీ, బీసీ, దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఉపకార వేతనాలు ఇప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ధర్మానాయక్ తెలిపారు. శుక్రవారం హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహిణులు, ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగులు దూర విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలు చేరుకోవచ్చని తెలిపారు.

పారిశుద్ధ్య లోపంతో జ్వరాల విజృంభణ

తుంగతుర్తి: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక డెంగీ జ్వరాలు ప్రభలుతున్నాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడారు. పల్లెల్లో పారిశుద్ధ్యాన్ని పట్టించుకునే నాథుడే లేడని ఆరోపించారు. అధికారుల పాలన వచ్చాక గ్రామాల్లో చెత్త సేకరణ పూర్తిగా నిలిచిపోయిందన్నారు. నిధులు లేక పంచాయతీ ట్రాక్టర్లు నడపలేకపోతున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రవి, శ్రీనివాస్, వెంకన్న, సంతోష్ పాల్గొన్నారు.

రైతుల వివరాల సేకరణ


ఈటూరులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ కృష్ణకాంత్

నాగారం: రేషన్‌కార్డు లేని వారికి రుణమాఫీ నిలిచిపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం నాగారం మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణకాంత్ మాట్లాడుతూ.. అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తుందని, రైతులు ఆందోళన చెందొద్దని తెలిపారు. సర్వేలో రుణమాఫీ కానీ రైతుల వివరాలను సేకరించి సీఎల్‌డబ్ల్యూ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. రుణమాఫీ కాని రైతులు కటుంబంలోని సభ్యులు వారి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జీరాక్స్, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ ఫారం నింపి మండల వ్యవసాయశాఖ అధికారులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రీను, శ్వేత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలి


సీడీపీఓను సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అర్వపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని తుంగతుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శ్రీజ అన్నారు. శుక్రవారం తిమ్మాపురం, అర్వపల్లి సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు మండల సూపర్‌వైజర్ సీహెచ్. అనిత ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్త సిలబస్ ప్రకారం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రీస్కూల్ కార్యక్రమాలను నడిపించాలన్నారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు బాలామృతం ప్లస్ అందజేయాలన్నారు. అనంతరం నూతనంగా వచ్చిన సీడీపీఓ శ్రీజను అంగన్‌వాడీ టీచర్లు సన్మానించారు. కార్యక్రమంలో నవనీత, ధనలక్ష్మి, సునంద, రాధ, నాగమణి, భాగ్యమ్మ, అంజమ్మ, శివరంజని, పరమేశ్వరి పాల్గొన్నారు.

వర్తక వాణిజ్య సంఘం అధ్యక్షుడికి సన్మానం

అర్వపల్లి: అర్వపల్లి పట్టణ వర్తక, వాణిజ్య సంఘం అధ్యక్షుడిగా స్థానిక శ్రీయోగానంద లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్ ఎన్నికయ్యారు. ఈమేరకు శుక్రవారం స్థానికంగా హమాలీ యూనియన్‌తో పాటు వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నూతనకల్: మండల పరిధిలోని మాచనపల్లి గ్రామంలో శుక్రవారం వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. దోమలు అరికడితే రోగాలు అదుపులో ఉంచవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సంతోషిమాత ఆలయంలో శ్రావణ పూజలు


సంతోషిమాత దేవాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

సూర్యాపేట: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు ఇరువంటి శివరామకృష్ణ శర్మ తెల్లవారుజామునే శ్రీ సంతోషిమాతకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అదేవిధంగా అమ్మవారి సన్నిధిలో గల శ్రీ చక్రానికి పూజలు జరిపించారు. అనంతరం శ్రీ సంతోషిమాత ఉద్యాపన వ్రతం నిర్వహించారు. సాయంత్రం వేళ వైభవ లక్ష్మీవ్రతం జరిపించారు. డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ సతీమణి డాక్టర్ ప్రమీల పూజల్లో పాల్గొన్నారు. జమ్మిగడ్డలోని శ్రీదత్తసాయి మందిరంలో మహిళలు పూజలు చేశారు.

దొరికిన నగదు బాధితుడికి అప్పగింత


బాధితుడికి నగదు అందజేస్తున్న లక్ష్మీకాంత్

సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలోని వ్యాపారి చల్లా లక్ష్మీకాంత్ తనకు రోడ్డు పక్కన దొరికిన రూ.35వేల నగదును బాధితుడికి అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఉదయం పట్టణానికి చెందిన చల్లా లక్ష్మీకాంత్, తన గుమస్తా నరేష్‌తో కలిసి నల్లాలబావి రోడ్‌లో వెళ్తుండగా రోడ్డు పక్కన రూ.35వేల నగదు కనిపించింది. నగదుతో పాటు బ్యాంక్ ఓచర్ ఉండడంతో అందులోని మొబైల్ నంబర్‌కు ఫోన్ చేశాడు. రాజేష్ అనే వ్యక్తి ఆ డబ్బు తనదేనని, బ్యాంకులో జమ చేయడానికి వెళ్తుంటే దారిలో తన గుమస్తా జేబులో నుంచి జారి రోడ్డుపై పడిపోయిందని తెలిపాడు. లక్ష్మీకాంత్ ఆ నగదును రాజేష్‌కు అందజేశాడు. పోగొట్టుకున్న డబ్బు తిరిగి దొరకడంతో రాజేష్ సంతోషం వ్యక్తం చేశాడు. లక్ష్మీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. దొరికిన నగదును నిజాయితీగా బాధితుడికి అందజేసిన లక్ష్మీకాంత్‌ను పట్టణ ప్రముఖులు, వ్యాపారులు అభినందించారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలికి సన్మానం

పెన్‌పహాడ్: వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులకు సమాజంలో గొప్ప గౌరవం ఉంటుందని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. శుక్రవారం పెనపహాడ్ మండల పరిధిలోని యల్లప్పకుంట తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు పావని వాణి ఇటీవల దూపహాడ్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంధ్యాల వినోద్, మండల నోడల్ అధికారి ధరావత్ వస్రాం, నల్లా శ్రీనివాస్, గోపతి రామారావు, నంద సైదిరెడ్డి, రాజ్‌కుమార్, శైలజ, స్నేహలత, మహేశ్వరి, రమేష్, బుజ్జి, శంకర్, నీలమ్మ, స్వాతి, ఇనూష తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయ దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ నకిరేకంటి రవి

గిరిజన సింహగర్జన సభను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సేవాలాల్ సేన నాయకులు

చివ్వెంల(సూర్యాపేట): గిరిజనుల సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో వచ్చే నెల 9న నిర్వహించే గిరిజన సింహగర్జన సభను విజయవంతం చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర కోఆర్డినేటర్ ధరావతు రాజేష్ నాయక్ కోరారు. శుక్రవారం చివ్వెంల మండల కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించారు. గిరిజనులకు 12శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, ప్రస్తుతం జీఓ నంబర్ 33 ద్వారా అమలవుతున్న 10శాతం రిజర్వేషన్ కాపాడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భుక్యా నాగు నాయక్, మాజీ సర్పంచ్ భద్రు నాయక్, ధరావతు శివరాం నాయక్, భుక్యా వెంకన్న నాయక్, సేవ్యా నాయక్, రాజశేఖర్ నాయక్, హరీష్ నాయక్, రవి నాయక్, రాజేష్ నాయక్, దేవేందర్ నాయక్ పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలపై శ్రద్ధ వహించాలి


క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎస్ఐ రవీందర్

పెన్‌పహాడ్: విద్యార్థులు విద్యకు మాత్రమే పరిమితం కాకుండా క్రీడలపై శ్రద్ధ పెట్టాలని ఎస్ఐ రవీందర్ అన్నారు. శుక్రవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటలతో శారీరకంగా, మానసికంగా ధృడత్వం పొందవచ్చని తెలిపారు. క్రీడల్లో ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో విజేతలుగా రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని సెలవు దినాల్లో వారికి నచ్చిన క్రీడల్లో ప్రావీణ్యం పొందేలా ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో వస్రాంనాయక్, మల్లారెడ్డి, ప్రభాకర్, రవికుమార్, సునీత, ప్రమీల, రఫీయా, రాములు, వెంకటేశ్వర్లు, భిక్షం, మహబూబ్‌అలీ, పవిత్ర, పద్మ, రాజ్యలక్ష్మి, విజయకుమారి, నాగమని, శ్రీధర్, హన్మంతు, ఆనందభాస్కర్, మనోహర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై ఇంటింటి సర్వే

- ఈ నెల 28 నుంచి మొదలైన ప్రక్రియ
- ఇప్పటికే జాజిరెడ్డిగూడెం మండలంలో 200 కుటుంబాల నిర్ధారణ
- రైతులు అందుబాటులో ఉండాలని అధికారుల సూచన


అడివెంలలో సర్వే అనంతరం రైతుతో సెల్ఫీ దిగుతున్న మండల వ్యవసాయ అధికారి గణేష్

అర్వపల్లి: రుణమాఫీ వర్తించని కుటుంబాల వివరాలు సేకరించి రుణమాఫీ సమస్యలు పరిష్కరించేందుకు వ్యవసాయ అధికారులు చేపట్టిన ఇంటింటి సర్వే ముమ్మరం చేశారు. ఈ నెల 28 నుంచి రుణమాఫీ రైతుల గుర్తింపు సర్వే మొదలుకాగా వచ్చే నెల 10 వరకు ఈ సర్వే జరగనుంది.

ఇప్పటివరకు 200 కుటుంబాల నిర్ధారణ

అర్హులై ఉండి సాంకేతిక సమస్యలు, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, కుటుంబ సభ్యుల నిర్ధారణ తదితర కారణాలతో మండలంలో పలువురు రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారులు రోజుకో గ్రామం తిరుగుతూ రైతుల ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలో 4,500మంది రైతులు రుణమాఫీకి అర్హులు కాగా సుమారు 3000 మందికి రుణాలు మాఫీ అయ్యాయి. ఇప్పటివరకు 200మంది రైతులను గుర్తించి రైతు భరోసా యాప్‌లో వివరాలు నమోదు చేశారు. వారి వివరాలు నమోదు చేసుకోవడంతో పాటు వారి కుటుంబ సభ్యులతో ఫొటోలను దిగుతున్నారు.

మా కుటుంబాన్ని సర్వేలో గుర్తించారు



రుణమాఫీలో మాకు పంట రుణం మాఫీ కాలేదు. రైతువేదికలో ఫిర్యాదు చేయగా వ్యవసాయ అధికారులు ఇంటికి వచ్చి సర్వే చేసి నిర్ధారణ చేసి ఫోటో తీసుకొని వెళ్లారు.

– శ్రీరాములు, అడివెంల

రైతులు అందుబాటులో ఉండాలి



రుణమాఫీ కాని రైతులు అందుబాటులో ఉండి సర్వేలో తగిన వివరాలు అందించాలి. జాజిరెడ్డిగూడెం మండలంలో ఇప్పటి వరకు 200 మంది రైతులను గుర్తించాం. అర్హులైన వారందరికీ రుణాలు మాఫీ అవుతాయి. రైతులు ఆందోళన చెందొద్దు.

– పెండోట గణేష్, ఎంఏఓ

క్లుప్తంగా

ఘనంగా సామూహిక జన్మదిన వేడుకలు

సూర్యాపేట: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట యూనిట్ ఆధ్వర్యంలో ఆగస్టు నెలలో జన్మించిన సభ్యుల సామూహిక జన్మదిన వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, అమీద్‌ఖాన్, నాగేశ్వర్‌రావు, సురేందర్‌రెడ్డి, సోమయ్య, రవీయ్య, లక్ష్మి, రాంరెడ్డి, అశోక్‌కుమార్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలు విడుదల చేసి పంటలు కాపాడాలి

అర్వపల్లి: తుంగతుర్తి నియోజకవర్గానికి గోదావరి జలాలు విడుదల చేసి ఎండిపోతున్న వరి పంటలను కాపాడాలని రైతు సంఘం డివిజన్ నాయకుడు వజ్జె శ్రీనివాస్ నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. శుక్రవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. సరైన వర్షాలు లేక రైతులు సాగు నీటి కొరతతో గత సీజన్‌లో కన్నా సగం మాత్రమే వరి పంటలు సాగుచేశారన్నారు. ఆ పంటలు కూడా నీళ్ల లేక ఎండిపోతున్నాయని తెలిపారు.

3, 4వ తేదీల్లో క్రీడాకారుల ఎంపిక


మాట్లాడుతున్న మండల విద్యాధికారి


తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 3, 4 తేదీల్లో ఎస్‌జీఎఫ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈమేరకు క్రీడా ప్రాంగణాన్ని మండల విద్యాధికారి శాంతయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024–25 సంవత్సరానికి గాను ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో సెప్టెంబర్ 3న బాలికలకు, 4న బాలురకు ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ మహేష్, వెంకన్న, రాజీవ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


లక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్ 1993–94 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన బిక్కి లక్ష్మి ఇటీవల మృతి చెందింది. అదే బ్యాచ్‌కు చెందిన తోటి విద్యార్థులు బాధిత కుటుంబానికి శుక్రవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం లక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెంటాల కరుణకుమార్, మంజుల, దాసరి అనిత, తాడూరి ఆంజనేయులు, వల్లాల సత్యనారాయణ, శిగ రవి, నల్గూరి రణధీర్, చిన రాములు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే పరిశీలన


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పవన్

అర్వపల్లి: అర్వపల్లిలో వైద్యసిబ్బంది నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను ఎంపీడీఓ తుమ్మల పవన్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. డెంగీ విజృంభిస్తున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ఆశ కార్యకర్తలు మాగి స్వరూప, మామిడి అరుణ పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన ఆలయ భూములు కాపాడాలి

మునగాల : హైడ్రా తరహా వ్యవస్థను ఏర్పాటు చేసి సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అన్యాక్రాంతమైన ఆలయ భూములను కాపాడాలని నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆలయ భూములు వేల ఎకరాల్లో కబ్జాకు గురై నామమాత్రపు కౌలు కూడా రాకపోవడంతో పురాతన దేవాలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని తెలిపారు. సీనియర్ అధికారి పర్యవేక్షణలో ఆలయ భూములను కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

వర్షం వస్తే బురదే..

అర్వపల్లి: మండల పరిధిలోని కొమ్మాల గ్రామ పంచాయతీ ఆవాసం మర్రిబావితండాకు వెళ్లే ఫార్మేషన్ రోడ్డు అధ్వానంగా మారింది. కొమ్మాల పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తండా వరకు కిలోమీటరున్నర దూరం ఉన్న ఈ రోడ్డు వర్షం వస్తే బురదమయంగా మారుతుంది. దీంతో గిరిజనులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బీటీగా మార్చాలని తండా ప్రజలు కోరుతున్నారు.


బురదమయంగా మారిన మర్రిబావితండా రోడ్డు

రోడ్డుపక్కన ప్రమాదకర గుంత

తుంగతుర్తి : మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో పైపులైన్ లీకేజీ కావడంతో గత నెల రోజుల క్రితం గుంతను తవ్వి పైప్‌లైన్ లీకేజీ పనులు చేశారు. తిరిగి గుంత పూడ్చకుండా అలాగే వదిలేశారు. రోడ్డు పక్కన గుంత ప్రమాదకరంగా మారడంతో ఆ దారిగుండా వెళ్లే ద్విచక్ర వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. గుంతను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


కొత్తగూడెంలో రోడ్డు పక్కన తవ్వి వదిలేసిన గుంత